క్లుప్తంగా

ముగిసిన ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ముత్యాలమ్మకు పూజలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ తృతీయ వార్షిక వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి దాతలు అందించిన విరాళాలతో స్వర్ణ వర్ణ పూరక కవచాలను తయారు చేయించి అలంకరించినట్లు ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ తెలిపారు. స్వర్ణ వర్ణ పూరక కవచాలకు గుర్వాయిగూడెం అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కీసర రామిరెడ్డి దంపతులు రూ.50 వేలు, బవిరిశెట్టి తిలక్, సురేష్, సతీష్ సంయుక్తంగా రూ.25 వేలు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కాజా ఫణికుమార్ శర్మ, ధనకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



షిర్డిసాయికి పూజలు చేస్తున్న భక్తులు

లింగపాలెం : ధర్మాజీగూడెం గ్రామంలోని శ్రీషిర్డీ సాయిబాబా దర్శన్ ఆలయ 25వ వార్షిక వేడుకలు గురువారం అత్యంతవైభవంగా నిర్వహించారు. బాబావారికి కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకాలు, ఉచిత సామూహిక సత్యవ్రతాలు, చందనోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, వ్రతాలు చేశారు. పూజల అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం మేళతాళాలతో బాబావారి పల్లకీ సేవ నిర్వహించారు. పవళింపు సేవతో కార్యక్రమాలను ముగించారు.

150 మందికి వైద్య పరీక్షలు



బంగారమ్మపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : మండలంలోని బంగారమ్మపేటలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీరామశక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి కిమ్స్ (బొల్లినేని) ఆసపత్రి వైద్యులు వైద్య సేవలు అందించారు. శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ వంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే గతంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి సంబంధించి 65 మందికి గౌతమి నేత్రాలయ వారు అందించిన కళ్లజోళ్లను శిబిరంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరామశక్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పప్పుల శ్రీనివాసరావు, రెడ్డిమురళి, నౌడు నాగేశ్వరరావు, రమణ, అరవాలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ప్రార్థనలు



జంగారెడ్డిగూడెం బిలాల్ మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

జంగారెడ్డిగూడెం : స్థానిక బిలాల్ మసీదులో గురువారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలకు బిలాల్ మసీదు గురువు హైదర్ఆలీ రిజ్వీ రంజాన్ మాస విశిష్టత, నియమాలను వివరించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ షేక్ జిలాని, ముస్లింలు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 50,112 విరాళంగా అందజేశారు. ఆకివీడుకు చెందిన చేబోయిన నాగశివకృష్ణ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు ఆలయ ఏఈఓ మెట్లపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఇక ప్రయాణం సాఫీగా..



బందంచర్లలో బీటీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



రాజుపోతేపల్లి అడ్డరోడ్డు నుంచి బందంచర్ల వరకు రహదారిని అభివృద్ధి చేయడం ఎంతో ఉపయోగకరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారనడానికి ఈ రహదారి నిర్మాణమే నిదర్శనం. సంక్షేమంతో పాటు అభివృద్ధిని శరవేగంగా కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సర్వత్రా రుణపడి ఉంటాం.

– వాసిరెడ్డి మధు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు

టి.నరసాపురం : రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అభివృద్ధి పనుల్లో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇటీవల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండడంతో అధ్వానంగా ఉన్న రోడ్లు అభివృద్ధికి నోచుకుంటున్నాయి. మండలంలోని రాజుపోతేపల్లి అడ్డరోడ్డు నుంచి బందంచర్ల గ్రామం చివరి వరకు 9 కిలోమీటర్ల మేర బీటీరోడ్డును నూతనంగా నిర్మించారు. దాదాపు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రోడ్డు అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేసింది. 5 గ్రామాల మీదుగా రూ.3 కోట్ల రూపాయలతో ఈ బీటీ రోడ్డును నిర్మించారు. మండలంలో ప్రధాన రహదారుల్లో ఒకటైన ఈ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో ఇక ప్రయాణం సాఫీగా సాగిపోతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పుప్పాలవారిగూడెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ యాని ప్రీతీ

లింగపాలెం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం తలపెట్టిన ప్రజల ముంగిటే నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ యాని ప్రీతీ అన్నారు. గురువారం కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలో గల పుప్పాలవారిగూడెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు డాక్టర్ యాని ప్రీతీ రోగులకు బీపీ, షుగర్, తదితర సమస్యలతో వచ్చిన వారికి పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఎటువంటి ఆహార నియమాలు పాటించాలన్నా విషయాలపై ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ శీతల పానీయాల వినియోగం తగ్గించాలన్నారు. ఆహారం తీసుకున్న అనంతరం నోరు పుక్కిలించుకోవాలని, ప్రతి రోజు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని తద్వారా నోటి కేన్సర్ రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. గర్భిణులను, బాలింతలను పరీక్షించి సుఖ కాన్పుల గురించి వివరించారు. వైద్య సిబ్బంది రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యస్ ఉమామహేశ్వరావు, ఎమ్ఎల్‌హెచ్ పి శ్రీవల్లి, హెల్త్ అసిస్టెంట్ బి.చంద్రశేఖర్, ఏఎన్ఎం హేమలత, డీఈఓ వెంకన్నబాబు, పైలట్ ప్రసాద్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం : ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంతరాలు లేని సమాజం కోసం కలలుగన్న భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం అన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 92వ వర్ధంతి కార్యక్రమాన్ని జంగారెడ్డిగూడెంలో గురువారం నిర్వహించారు. పీడీఎస్‌యూ, పీవైఎల్, ఇఫ్టూ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భూషణం మాట్లాడుతూ జాతీయ ఉద్యమ వీరుల స్ఫూర్తికి భిన్నంగా కేంద్రం పాలన ఉందన్నారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ కారణంగా ప్రజల మధ్య అంతరాలు పెరిగిపోతున్నాయన్నారు. విద్యావ్యవస్థను ప్రైవేటీకరణ చేసే క్రమంలో నూతన విధానాలు అవలంభిస్తున్నారని, దీని వల్ల పేదవాడికి విద్యదూరమవుతుందన్నారు. పీవైఎల్ నాయకులు కె.పోతిరెడ్డి, టి.బాబూరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకులు మంచిలి రాజు యువజన నాయకులు ముక్కారెడ్డి నాగార్జున, ప్రదీప్, కట్టం నాగేశ్వరరావు, నడిపి రాజు, గంగాధర్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో నివాళులు అర్పిస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్, ఇఫ్టూ నాయకులు



చింతలపూడిలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



ఏఎస్ఆర్ నగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రత్యేక పంచాయతీ పోరాట సమితీ, సీపీఎం నేతలు

అమరవీరులకు నివాళి

కొయ్యలగూడెం : రాజ్ గురు, సుఖదేవ్, భగత్ సింగ్‌ల వర్ధంతి సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక రైస్‌మిల్లులో అమరవీరులకు నివాళి కార్యక్రమం నిర్వహించారు. నాయకుల చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. భగత్ సింగ్, రాజ్ గురువు, సుఖదేవుల ఆశయాలను సాధిస్తాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. డీవైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు బోగోలు సురేష్, సాదుపోయిన శివకుమార్, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వంకా దుర్గారావు, మల్లపూడి సురేష్, డి.ధనరాజు, కె.సీతారాములు, అడపా సతీష్, సీహెచ్ సత్యనారాయణ, దాసరి వీర్రాజు, ఉద్దండం గోపి, పిల్ల తమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : భగత్‌సింగ్ 92వ వర్ధంతిని చింతలపూడిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భగత్ సింగ్, సుఖ్‌దేవ్ త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.గురవయ్య, సహాయ కార్యదర్శి పి సోమశేఖర్, జంగా రామచంద్రారెడ్డి, బోడ వజ్రం, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి టి బాబు, దొంతా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

భగత్ సింగ్ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి ఎస్.సూర్యకుమార్, కె.అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, మతోన్మాద శక్తులను దేశంలో నిర్మూలించిన నాడే భగత్ సింగ్‌కు నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో రామిశెట్టి సత్యన్నారాయణ, వరలక్ష్మిదేవి, ఆర్.ధర్మారావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని కృష్ణాపురం మెట్ట ఆల్లూరి సీత రామరాజు కాలనీలో ప్రత్యేక గ్రామ పంచాయతీ పోరాటసమితి కమిటీ, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక గ్రామ పంచాయతీ పోరాట సమితి కమిటీలకు సీపీఎం మద్దతుగా నిలుస్తుందని నాయకులు తెలిపారు. అనంతరం ఏడు గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీ కావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో భూక్యా వేణుగోపాల్, అనుమోలు మురళి కృష్ణ, కుంజా కిరణ్, మడకం సుబ్బాయమ్మ, షేక్ అమీనా, మడకం కుమారి. వి.లక్ష్మి, పిట్టల మంగమ్మ, తాటి బోసమ, పండు వీరభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం : విద్యుత్ మరమ్మతులు, చెట్ల నరికివేత తదితర పనుల నిమిత్తం శుక్రవారం మండలంలోని టి.నరసాపురం ఫీడర్ పరిధిలోని టి.నరసాపురం, రాజుపోతేపల్లి, మక్కినవారిగూడెం, బండివారిగూడెం, తిరుమలదేవిపేట విద్యుత్ ఉపకేంద్రాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. కావున ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వేదపండితులకు సత్కారం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని బుధవారం రాత్రి వేదపండితులను సత్కరించారు. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు చిలుకూరి సాయిబాబా, వేద గాయత్రీ పురోహిత సంఘం అధ్యక్షులు గరిమెళ్ళ భాస్కర్ సమన్వయంతో 25 మంది పురోహిత, అర్చకులకు సత్కారం చేసి నూతన వస్త్రాలు అందించారు. శ్రీబాలా త్రిపుర సుందరీ పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్ ఆధ్వర్యంలో ఆలయకమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

కళాకారులకు సన్మానం

కొయ్యలగూడెం : దైనందిన జీవితంలో క్రమశిక్షణకు ఆధ్యాత్మికత దోహదపడుతుందని పలువురు పేర్కొన్నారు. శోభకృత్ నామ ఉగాది వేడుకలను పురస్కరించుకుని కొయ్యలగూడెం ఏవీఆర్ఎం స్కూల్ వద్ద ఆధ్యాత్మిక కళాకారులకు అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉమాదేవి, ప్రైవేట్ పాఠశాలల డివిజన్ అధ్యక్షుడు ఐ.రాజకుమార్, అపోలో, వీఎస్ఎన్ కళాశాలల ప్రిన్సిపాల్స్, శ్రీవిద్య, స్వామి, సత్యసాయి సేవాసమితి సభ్యులు సత్యనారాయణ, సీహెచ్ వెంకటరమణ, ఎంపీటీసీ శ్రీదేవి తదితరులను ఘనంగా సత్కరించారు.

పన్నులపై వడ్డీ రాయితీ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి సరఫరా పన్నులపై వడ్డీ రాయితీ అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీన వడ్డీ రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ నెల 31వ తేదీ లోగా పన్నులు ఏక మొత్తంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు. 31వ తేదీ సెలవు రోజు కూడా మున్సిపల్ కార్యాలయ ప్రత్యేక కౌంటర్ ద్వారా పన్నులు కట్టించుకోవడం జరుగుతుందన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

చింతలపూడి : మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామంలో కోడిపందేలపై పోలీసులు దాడులు జరిపి 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై డి.హరికృష్ణ గురువారం తెలిపారు. పట్టుబడ్డ వ్యక్తుల నుంచి రూ.20,500 నగదు, 16 ద్విచక్ర వాహనాలు, 4 కోడి పుంజులు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోషణ పక్వాడాను సద్వినియోగం చేసుకోవాలి

కొయ్యలగూడెం : పోషణ పక్వాడా పథకాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు, పిల్లలు పరిపుష్టితతో కూడిన ఆరోగ్యవంతులు కావాలని ఐసీడీఎస్ పీఓ యూఎన్ స్వర్ణకుమారి పేర్కొన్నారు. సూపర్‌వైజర్ నయోమిరాణి ఆధ్వర్యంలో గురువారం కన్నాపురం సచివాలయం వద్ద పోషణ పక్వాడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల పద్మావతితో కలసి పోషణ పక్వాడా గురించి వివరించారు. మార్చి 20వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు కొయ్యలగూడెం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మిల్లెట్ ఆధారిత అవగాహన, వంటల పోటీలు, చిరుధాన్యాల సాగుపై శిక్షణ, గృహాల సందర్శన, తదితర అంశాలు పొందుపరిచామని పేర్కొన్నారు. పంచాయతీ ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



కన్నాపురంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న పీవో స్వర్ణకుమారి

చిరుధాన్యాలతో అనారోగ్య సమస్యలు దూరం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : చిరుధాన్యాల వినియోగంతో అనారోగ్య సమస్యలు తలెత్తవని ఏఓ కాలింగి గంగాధర్ రావు అన్నారు. స్థానిక మండల సమైఖ్య కార్యాలయంలో గురువారం రైతు ఉత్పత్తుల సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కేఎమ్ మంగతయారు అధ్యక్షతన చిరు ధాన్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల వాడకం వల్ల పలు రకాల అనారోగ్య సమస్యలు నివారించవచ్చని అన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. పురాతన పద్ధతిలో సేంద్రియ ఎరువుల ద్వారా చిరుధాన్యాలు పండించడానికి రైతులు ఆసక్తి కనబరచ్చాలని కోరారు. ఏపీఎమ్ అడమిల్లి రామారావు మాట్లాడుతూ చిరుధాన్యాలు పండించే రైతులకు వచ్చే తొలకరి నాటికి కృషి విజ్ఞాన కేంద్రం(వెంకటరామన్నగూడెం) ద్వారా ఉచితంగా చిరుధాన్యాలను పంపిణీ చేస్తామని చెప్పారు. కాగా ఈ సమావేశంలో 17 మంది రైతులు 14 ఎకరాల్లో చిరు ధాన్యాల సాగు చేసేందుకు ముందుకు వచ్చారు. అలాగే ఈ ఏడాది ఎఫ్‌పీఓల ద్వారా 50 ఎకరాల్లో మిల్లెట్స్ పండించేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఈ తాడేపల్లి పేరయ్య శాస్త్రి, ఆర్‌వైఎస్ఎస్ ఎంటి దాసరి సామ్రాజ్యం, సీసీలు కె.సురేష్‌బాబు, డి.దాసు, ఎఫ్ఎమ్ సముద్రాల వెంకటేశ్వరరావు, వీఓఏలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

కళాపరిషత్ వార్షిక వేడుకలు

జంగారెడ్డిగూడెం : కాసర నర్సిరెడ్డి కల్చరల్, చారిటబుల్ ట్రస్ట్, చిలుకూరి ఝాన్సీలక్ష్మీరాణిరెడ్డి కళాపరిషత్ 15వ వార్షిక వేడుకలు బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఉగాది పర్వదినం, వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంబీ సోషల్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కాసర నర్సిరెడ్డి రాసిన 'స్వీయ చరిత్ర' పుస్తకాన్ని, అలాగే కవి, కథకుడు జుజ్జూరి వేణుగోపాల్ రాసిన కథాసంపుటి 'అల్టర్ ఈగో' పుస్తకాన్ని మాజీ డీసీసీబీ అధ్యక్షుడు కరాటం రాంబాబు ఆవిష్కరించారు. సీనియర్ బుర్రకథ కళాకారులు సబ్బిన కనకారావును జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. నాట్యాచారిణి రూపాదేవి శిష్యబృందం, జానపద కళాకారులు ఎల్ఆర్ కృష్ణబాబు బృందం శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. రాజర్షి ఆధ్వర్యంలో 'రాయి' అనే నాటికను ప్రదర్శించారు. పేద కళాకారులకు సహాయాన్ని అందించారు. మెట్టా నాగేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం ఎంబీ సోషల్ క్లబ్‌లో స్వీయ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కరాటం రాంబాబు

వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

కొయ్యలగూడెం : వర్జీనియా పొగాకు కొనుగోళ్లు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయి. వేలం నిర్వహణాధికారి ఎం.గ్రేస్ మార్గరెట్ ఆధ్వర్యంలో పొగాకు అమ్మకాలు నిర్వహించారు. అంకాలగూడెం క్లస్టర్ కు చెందిన 36 బేళ్ల విక్రయానికి ఉంచగా అన్ని బేళ్లు కేజీ రూ.210కు వివిధ కంపెనీలు వేలంలో దక్కించుకున్నాయి. వేలం అనంతరం గ్రేస్ మార్గరెట్ మాట్లాడుతూ ఈ సంవత్సరం బోర్డు వారి ప్రాథమిక అంచనాల ప్రకారం కొయ్యలగూడెం వేలం కేంద్రం పరిధిలో గల పొగాకు రైతులు పన్నెండున్నర మిలియన్ల కేజీల పొగాకు పంటను ఉత్పత్తి చేశారన్నారు. ఇది అనుమతించిన దాని కన్నా రెండున్నర మిలియన్ల కేజీలు ఎక్కువన్నారు. ప్రస్తుత సీజన్లో బేరన్ పొగాకు ఉత్పత్తికి రూ.లక్షా 80 వేలు అదనపు ఖర్చు అయిందని ఈ నేపథ్యంలో గత సంవత్సరం వచ్చిన సరాసరి కంటే 20 శాతం సగటు పెరుగుదల ఉండేలా చూడాలని రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది పేర్కొన్నారు. రైతు నాయకులు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, అల్లూరి రాంబాబు, అడపా సత్తిబాబు, సైదులు, కాకర్ల శేషు, మధ్యాహ్నపు యేసు, గెడా సత్తిబాబు, రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తున్న దృశ్యం

నూకాలమ్మకు కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ ఆలయ 59వ ఉగాది వార్షిక జాతర మహోత్సవాలు ఏడవ రోజు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రభాత పూజలు, నిత్యకైంకర్యాలు అనంతరం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు యర్రమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై ఉంచి శాంతి కళ్యాణం నిర్వహించారు. శ్రీఅభయాంజనేయ భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : అకాల వర్షాల కారణంగా జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కె.గంగాధర్ మాట్లాడుతూ అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న, పొగాకు, పుచ్చ, జీడిమామిడి, మామిడి పంటలను పరిశీలించి పంట నష్టపరిహారం చెల్లించే విధంగా అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాస్, రైతులు ఈడా వీర్రాజు, కొప్పుల నాగేశ్వరరావు, జి.ఏసు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ములగలంపల్లిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఘనంగా ఆలయ శంకుస్థాపన ఉత్సవం

కొయ్యలగూడెం : శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ శంకుస్థాపన ఉత్సవం పొంగుటూరు పంచాయతీ కన్నాయిగూడెం గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9:58 నిమిషాలకు యంత్ర ప్రతిష్ఠ నిర్వహించగా ఏడు గంటల నుంచి మంగళ తోరణం అలంకరణ, గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనగా పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

విద్యార్థులకు బహుమతుల అందజేత

పోలవరం రూరల్ : మనిషి చేసే ప్రతి పని సైన్స్ ఆధారితమే అని గూటాల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేవీ రాఘవన్ అన్నారు. పాఠశాలలో సైన్స్ దినోత్సవ కార్యక్రమ విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ క్రియా స్వచ్ఛంద సంస్థ జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు క్రియా స్వచ్ఛంద సంస్థ స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో పాటు సర్టిఫికెట్లను అందజేసింది. కార్యక్రమంలో ఎంఈవో బీఎస్ స్వరూప్, సిరపారపు ప్రసాద్, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.